క్లుప్తంగా

అమ్మవారికి వెండి కుందుల సమర్పణ



అమ్మవారికి వెండి కుందులు సమర్పిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): మావుళ్లమ్మ అమ్మవారికి కర్నూల్‌కి చెందిన ఆర్.సౌమ్య రెడ్డి 300 గ్రాముల వెండి కుందులు అమ్మవారికి సమర్పించారు. ఆలయ ఉపప్రధాన అర్చకులు కొప్పేశ్వరరావు వీరికి పూజలు నిర్వహించారు. ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి బుద్ధ మహాలక్ష్మి నగేష్ ప్రసాదాలు, అమ్మవారి ఫోటో అందజేశారు.

తీర ప్రాంత గ్రామాల్లో పంట బోదెల తవ్వకం



పంటబోదె తవ్వుతున్న ఉపాధి కూలీలు

మొగల్తూరు: తీర ప్రాంత గ్రామాలైన కేపీపాలెం నార్త్, సౌత్, పేరుపాలెం నార్త్, సౌత్ గ్రామాల్లో పంట బోదె తవ్వకాలు చురుగ్గా కొనసాగుతున్నాయి. వ్యవసాయ పనులు పూర్తికావడంతో పాటు కేపీపాలెం మంచి నీటి చెరువును పూర్తి స్థాయిలో నింపారు. ఇక ఉన్న నీటిని కొబ్బరి, సరుగుడు, మామిడి తోటలకు పూర్తిస్థాయిలో నీరు అందేలా పంట బోదెలు తవ్వకాలు చేపట్టారు. శుక్రవారం కేపీపాలెం సౌత్ గ్రామంలోని ప్రధాన పంట బోదెలో గుర్రపు డెక్క, మట్టి మేటలు వేయడంతో వాటిని తొలగించేందుకు పంట బోదె తవ్వకాలు చేపట్టారు. అధికారుల ఆదేశాల మేరకు నీరు వృథా కాకుండా తోటలకు నీరందేలా పంట బోదెలు తవ్వకాలు చేపట్టామని టీఏ వెంకటేశ్వరరావు తెలిపారు.

ప్రశాంతంగా టెన్త్ సప్లిమెంటరీ

పెనుగొండ: పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. శుక్రవారం తెలుగు పరీక్షకు పెనుగొండ మండలంలో 282 మంది విద్యార్థులకు, 103 మంది హాజరయ్యారని ఎంఈవో డి శుభకరరావు తెలిపారు. పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు.

జోరు వానతో రైతులకు ఇక్కట్లు



జోరు వానకు ఊగుతున్న కొబ్బరిచెట్లు

యలమంచిలి: అకస్మాత్తుగా శుక్రవారం సాయంత్రం కురిసిన వర్షంతో ప్రజలు సేద తీరారు. బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడిందని వార్తలు వస్తున్న నేపథ్యంలో వర్షం సాధారణ ప్రజలకు ఉపశమనం కలిగించినా రైతులకు మాత్రం గుండెల్లో రైళ్లు పరిగెట్టించింది. యంత్రాలతో వరి పంట కోసిన రైతులు ధాన్యంలో తేమ శాతం తగ్గించడానికి రాశుల్లో ధాన్యాన్ని ఆరబెడుతున్నారు. ఒక్కసారిగా మబ్బులు కమ్మడంతో రైతులంతా అప్రమత్తమై ధాన్యంపై బరకాలు కప్పారు. మామిడి రైతులు కూడా ఆందోళన చెందారు. ఈదురు గాలికి మామిడి కాయలు రాలాయి. మట్టి పని చేస్తున్న వారికి కూడా వర్షం అంతరాయాన్ని కలిగించింది.

27న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

యలమంచిలి: ఈ నెల 27వ తేదీ సోమవారం మధ్యాహ్నం రెండు గంటలకు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ పి శ్రీనివాసరావు తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో నిబంధనలకు లోబడి సమావేశం నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అన్ని శాఖల అధికారులు సమావేశానికి హాజరుకావాలని ఆయన కోరారు.

మావూరమ్మ ఆలయ ఆవరణలో అన్నసమారాధన



మావూరమ్మను దర్శించుకుంటున్న గుడాల మంగతాయారు

పాలకొల్లు అర్బన్: పట్టణంలోని బంగారువారి చెరువుగట్టులో వేంచేసియున్న మావూరమ్మవారి జాతర ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అన్నసమారాధన నిర్వహించారు. ఈ అన్నసమారాధనలో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడాల శ్రీహరిగోపాలరావు (గోపి) భార్య మంగతాయారు పాల్గొని అన్నసమారాధనను ప్రారంభించారు. ముందుగా మంగతాయారు మావూరమ్మను దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం భక్తులకు ప్రసాదాలు వడ్డించారు. అన్నసమారాధనకు కె కిషోర్ వర్మ రూ.40వేలు, భక్తులు విరాళాలు అందజేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి అమ్మవారి ప్రసాదం స్వీకరించారు.

వ్యవసాయానికి భరోసా

- ఐదేళ్లుగా అన్నదాతకు ఆర్థికసాయం
- తాజా మేనిఫెస్టోలో రైతు భరోసా సాయం రూ.16వేలు పెంచుతూ నిర్ణయం
- రైతు భరోసా కేంద్రాలతో ఉన్న ఊరిలోనే విత్తనాలు, ఎరువులు
- ఆనందం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు



పొలంలో నాట్లు వేస్తున్న దృశ్యం(ఫైల్)

పాలకోడేరు: ప్రజాసంకల్పయాత్రలో రైతుల కష్టాలు తెలుసుకున్న జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక రాష్ట్రంలో అన్నదాతల కోసం వ్యవసాయంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చారు. అరుగాలం శ్రమించే రైతులు సాగు సమయంలో విత్తనాలు, ఎరువులు, కొనుగోలుకు ఇతర మదుపుల కోసం ఎలాంటి అప్పులు చేయకుండా ఉండాలనే రైతు భరోసా పథకానికి శ్రీకారం చుట్టి ఒక్కో రైతుకు ఏటా రూ.13,500 చొప్పున ఐదేళ్ల పాటు అందజేశారు. 2019కి ముందు రైతులు విత్తనాలు, ఎరువుల కోసం మండల కేంద్రాలకు తిరుగుతూ క్యూలైన్లలో గంటల సమయం, నిలబడి, పోలీసులు లాఠీల దెబ్బలు తినాల్సిన దుస్థితి ఉండేది. రైతులు అలాంటి ఇబ్బందులు పడకూడదనే ప్రతి గ్రామ సచివాలయ ఆవరణలోనే రైతు భరోసా కేంద్రాలను నిర్మించి ఉన్న ఊరిలోనే విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు లభించే విధంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు చేపట్టారు. దీంతో అన్న దాతలు రైతుభరోసా కేంద్రానికి వెళితే చాలు వారికి కావాల్సిన విత్తనాలు, ఎరువులు లభిస్తున్నాయి. రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వం మద్దతు ధరకు ధాన్యం కొనుగోళ్లు చేపడుతుండడంతో రైతులకు దళారులు బెడద తప్పింది. ప్రతి సీజన్‌లోనూ సాగుచేసే పంటల వివరాలను ఈ–క్రాప్‌లో నమోదు చేయించి, పంటలకు నష్టం వాటిల్లితే సకాలంలో ప్రభుత్వం బీమా చెల్లించి ఆదుకుంది. 2009నుంచి 2024 వరకు రైతు కోసం అమలు చేస్తున్న రైతుభరోసా పథకాన్ని రాబోయే రోజుల్లో సాగు సాగిస్తూ ఇప్పుడున్న సాయం రూ.13,500 నుంచి 16వేలకు పెంచుతున్నట్లు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మేనిఫెస్టోలో ప్రకటించారు. రైతుల కోసం అమలు చేసిన ప్రతీ పథకం కొనసాగుతుందని సీఎం జగన్నన చేసిన ప్రకటనపై రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

రైతులకు అండగా సీఎం..

పాలకోడేరు: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రైతులకు ఎంతో అండగా నిలిచారు. గతంలో రైతులకు ఇన్ని సదుపాయాలు లేవు. జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక రైతుభరోసా పథకం ద్వారా ఏటా రూ.13,500 చొప్పున నాఖాతాలో జమచేశారు. ఎక్కడకకూ వెళ్లాల్సిన పనిలేకుండా మాఊరిలోనే రైతు భరోసా కేంద్రం ద్వారా విత్తనాలు, ఎరువులు సరఫరా చేశారు. పంటను కూడా రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేస్తున్నారు. మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయితే రైతు భరోసా కింద రూ.16వేలు ఇస్తానని చెప్పడం చాలా సంతోషంగా ఉంది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేసేది మాత్రమే చెప్తాడనే నమ్మకం మాకు ఉంది.

సీఎం జగన్ రైతు పక్షపాతి



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రైతుల పక్షపాతి అని మరొకమారు రుజువు చేసుకున్నారు. ఇదివరకు రైతులకు ఏడాదికి పెట్టుబడి సాయం వైఎస్సార్ రైతు భరోసా పథకం కింద రూ.13,500 ఇది వరకు అందజేశారు. ఈ మొత్తాన్ని రూ.16వేలకు పెంచడం ఆనందంగా ఉంది. అలాగే రైతులకు సున్నా వడ్డీ పంట రుణాలు, ఉచిత పంటల బీమ కూడా కొనసాగుతాయని ప్రకటించారు. 2019లో ఇచ్చిన హామీలన్నీ అమలు చేశారు. – కడలి శ్రీనివాస్, రైతు పాలకోడేరు

మాట ఇస్తే చేస్తారు



గతంలో సాగు సమయంలో అప్పులు చేసి మదుపులు పెట్టాల్సి వచ్చేది. కానీ జగనన్న సీఎం అయ్యాక పెట్టుబడి కోసం చేసే అప్పుల బారం తగ్గింది. రైతు భరోసా పథకం ద్వారా ఏటా రూ.13,500 తమ ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసింది. ఆ డబ్బులతో విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసుకున్నాం. గతంలో మాదిరిగా మండల కేంద్రాలకు వెళ్లాల్సిన పని లేకుండా ఊరిలోనే రైతు భరోసా కేంద్రాల వద్ద విత్తనాలు, ఎరువులు అందజేశారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి హయాంలోనే రైతులకు చాలా మేలు జరిగింది. తాజాగా మేనిఫెస్టోలో రైతు భరోసా రూ.16వేలకు పెంచుతానని జగనన్న హామీ ఇవ్వడం సంతోషంగా ఉంది. – గుడ్ల సత్యనారాయణ, రైతు వేంద్ర

రైతులకు మరింత భరోసా



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రైతుల కోసం అమలు చేస్తున్న పథకాలు వ్యవసాయరంగం అభివద్ధికి ఊతంగా నిలుస్తున్నాయి. సాగు పెట్టుబడిగా రైతు భరోసా పథకం పేరుతో అందిస్తున్న ఆర్థిక సాయం ఎంతగానో ఉపయోగపడుతుతోంది. ఏడాదికి రూ.13,500 చొప్పున గత ఐదేళ్లలలో రూ.67, 000 అందజేశారు. మళ్లీ అధికారంలోకి వస్తే ఈ సహాయాన్ని ఎటా రూ.16వేలు అందిస్తామని హామీ ఇవ్వడం ఆనందంగా ఉంది. రైతు భరోసా సాయం పెంచి అన్నదాతలకు మరింత భరోసా కల్పించారు. – మేడిది రాదాబాయి, రైతు వేంద్ర

సీపీఎఫ్ కంపెనీ మూసివేత పై చర్యలు తీసుకోవాలి

భీమవరం: గణపవరం మండలం సరిపల్లి గ్రామంలో ఉన్న సీపీఎఫ్ కంపెనీని అక్రమంగా మూసివేసి కార్మికుల పొట్ట కొట్టడం తగదని సీఐటీయు పశ్చిమగోదావరి జిల్లా కమిటీ అధ్యక్ష కార్యదర్శులు జేఎన్వి గోపాలం, కే రాజా రామ్మోహన్‌రాయ్ ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం వారు ఒక ప్రకటన విడుదల చేస్తూ సీపీఎఫ్ గ్రూప్ ఆఫ్ కంపెనీల యాజమాన్యం చట్ట విరుద్ధంగా కంపెనీని మూసివేయడం దారుణమన్నారు. ఉన్న ఉద్యోగాలనే కాపాడలేని పాలకులు కొత్త ఉద్యోగాలు ఇస్తామని వాగ్దానాలు చేయడం ప్రజలను మోసగించడమేనని అన్నారు. తక్షణమే ప్రభుత్వం జోక్యం చేసుకొని కంపెనీ యాజమాన్యం పై చర్య తీసుకోవాలని, కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

ముగిసిన చెన్నకేశవుని కల్యాణోత్సవాలు

ఉండి: ఉప్పులూరులో చుడికుద్దా నాంచియార్,అండాళ్ సమేత చెన్నకేశవస్వామి కల్యాణోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. ముగింపు సందర్భంగా ఆలయ ప్రాంగణంలో చెన్నకేశవ స్వామి సేవాసమితి ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆలయ కమిటీ చైర్మన్ యర్రా సుబ్బారావు తెలిపారు.అన్న సమారాధనకు గ్రామంలోని భక్తులతో పాటుగా పాములపర్రు, కోలమూరు, ఆరేడు, కలిగొట్ల, పాందువ్వ, ఉణుదుర్రు, యండగండి, గణపవరం, సరిపల్లె తదితర గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కల్యాణోత్సవాలను పురస్కరించుకుని వందలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆయన తెలిపారు.అలాగే ఉత్సవాల్లో సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నట్లు ఆయన తెలిపారు.

విద్యార్థుల సంపూర్ణ ఆరోగ్యానికి 'వేదిక్ విజన్'



వేదిక్ విజన్ పోస్టర్ విడుదల చేస్తున్న ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కేవీ మురళీకృష్ణంరాజు

భీమవరం: విద్యార్థుల సంపూర్ణ ఆరోగ్యం, మానసిక వికాసమే లక్ష్యంగా వేదిక్ విజన్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కేవీ మురళీకృష్ణం రాజు చెప్పారు. కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆయన శుక్రవారం కళాశాల సమావేశ హాల్లో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఇంజనీరింగ్ కెమిస్ట్రీ హెడ్, యోగా ట్రైనర్ డాక్టర్ పి భవాని, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ పి సత్యనారాయణ రాజు మాట్లాడుతూ విద్యార్థులు సాంకేతికతను జోడించి యోగ, క్రీడల్లో మంచి ప్రాధాన్యత సంపాదించవచ్చనే ఉద్దేశంతో దీన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో భాగంగా కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ సహాయంతో విద్యార్థులకు పలు అంశాలపై ఆగస్టు 2 నుంచి 13 వరకు శిక్షణ అందిస్తున్నట్లు చెప్పారు. శిక్షణ అనంతరం ఇదే అంశాలపై ఒక యాప్ రూపొందించేందుకు ఆగస్టు 14 ,15 తేదీల్లో హేకథాన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. తమ కళాశాల విద్యార్థులే కాకుండా ఇతర కళాశాల విద్యార్థులు కూడా ఇందులో భాగస్వాములు కావచ్చని పేర్కొన్నారు. కార్యక్రమాన్ని ఫిజికల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్, పీపుల్స్ అసోసియేషన్ ఆఫ్ ఇన్నర్ ఇంజనీరింగ్ (పీఏఐఈ) సీఎస్‌సీ డిపార్ట్మెంట్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ సిహెచ్ హరిమోహన్, విద్యార్థి ప్రతినిధులు పాల్గొన్నారు.

26న ఏబీఎస్‌వీకే ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరం

భీమవరం(ప్రకాశంచౌక్): పట్టణంలోని మెంటే వారి తోటలోని సుందరయ్య భవనం లో ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు బిపి, సుగర్ వ్యాధిగ్రస్తులకు వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు వసుధ ఫౌండేషన్ కన్వీనర్ ఇందుకూరి ప్రసాదరాజు తెలిపారు. అల్లూరి సీతారామరాజు భగత్ సింగ్ వైద్య సహాయ కేంద్రంలో విజయవాడకు చెందిన వైద్యులు డి .సందీప్ వర్మ, జి. పద్మజ, జి.సత్యనారాయణరాజు తదితరులు పాల్గొని వైద్య సేవలు అందజేస్తారన్నారు. ఈ అవకాశాన్ని పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మట్టి నమూనాల సేకరణ

పాలకోడేరు: ప్రతి ఏడాది రబి కోతలు పూర్తిగానే పోషకాల శాతాన్ని తెలుసుకోవడానికి ప్రభుత్వం నిర్దేశించిన మట్టి నమూనాలు సేకరిస్తున్నట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి వి.నారాయణరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యంగా ఈ ఏడాదిలో మండలంలో 200 మట్టి నమూనాలను సేకరించాలని ప్రభుత్వం నిర్దేశించగా ఇప్పటి వరకు సుమారుగా 90 శాతం నమూనాలు సేకరించామని తెలిపారు. ప్రస్తుతం మండల వ్యాప్తంగా రబీ కోతలు పూర్తయ్యాయని, ధాన్యం సేకరణ కూడా చాలావరకు పూర్తయ్యాయని అన్నారు. ముఖ్యంగా వరి కోతలు మిషన్ ద్వారా కోయటం వలన వచ్చే గడ్డిని చాలామంది రైతులు పొలంలో తగలబెడుతున్నారని అలా చేయడం వల్ల భూసారం దెబ్బ తింటుందని తెలిపారు. రైతు సోదరులంతా పొలంలో గడ్డిని తగలబెట్టకుండా చేను అంత జల్లుకుని ఖరీఫ్ సీజన్‌కి దమ్ము చేసుకోవడం వల్ల భూసారం పెరగడం వల్ల ఎరువుల వినియోగాన్ని తగ్గించుకోవచ్చని తెలియజేశారు.

నేడు, రేపు అలంపురంలో ఉచిత కంటిపరీక్షలు

పెంటపాడు: అలంపురం వెంకటరమణ సేవాట్రస్టు ఆస్పత్రి ఆధ్వర్యంలో ఈనెల 25,26 తేదీల్లో ఉచిత కంటి వైద్యపరీక్షలు చేయనున్నట్లు ట్రస్టు ప్రతినిధి కొలనువాడ పెదకృష్ణంరాజు ఒక ప్రకటనలో తెలిపారు. నిడదవోలు రాజేశ్వరి రామకృష్ణ లయన్స్ కంటి వైద్యులు వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి శస్త్రచికిత్సలు, కళ్లజోళ్లు రాయితీపై అందజేయనున్నట్లు ఆయన తెలిపారు. పరిసర గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

ధాన్యం డబ్బు వెంటనే ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న కేతా గోపాలన్

భీమవరం: రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం డబ్బులు వెంటనే ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. కౌలు రైతుల సంఘం జిల్లా కమిటీ సమావేశం భీమవరంలోని ఉపాధ్యాయ కార్యాలయంలో కేతా గోపాలన్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.హరిబాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం డబ్బులు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. నేడు వ్యవసాయం చేసేదంతా కౌలురైతులేనన్నారు. వారికి ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆసరా లేకపోయినా అధిక వడ్డీలకు ప్రైవేట్ అప్పులు తెచ్చి పంటలు పండిస్తున్నరన్నారు. ప్రభుత్వం నెలలు తరబడి డబ్బులు వేయకపోతే కౌలురైతుల కష్టార్జితం అంతా అప్పులకు, వడ్డీలకే సరిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ధాన్యం డబ్బలు విడుదల చేయడంతో పాటు పంట కాలువలు, మురుగు కాలువల ఆధునీకరణకు నిధులు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.రామాంజనేయులు, సభ్యులు పి.నర్శింహమూర్తి, సీహెచ్ శ్రీనివాసు, కె.శ్రీనివాస్, ఎ.సత్యనారాయణ, బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విజయోత్సవ ర్యాలీల నిషేధం



కుప్పనపూడి గ్రామంలో శాంతి కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఐ బత్తిన నాగబాబు

ఆకివీడు: కౌంటింగ్ అయిన తర్వాత విజయోత్సవ ర్యాలీలు ఎన్నికల కమిషన్ నిషేధించిందని ఎస్ఐ బత్తిన నాగబాబు చెప్పారు. మండలంలోని అజ్జమూరు, కుప్పనపూడి, స్థానిక నగర పంచాయతీలోని పలు వార్డుల్లో శుక్రవారం శాంతి సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు ఈ ప్రాంతంలో ప్రశాంతంగా జరిగాయని, కౌంటింగ్ కూడా ప్రశాంతంగా జరిగే విధంగా రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సహకరించాలన్నారు. గెలుపు ఓటమిలు సహజమని, దేనినైనా స్ఫూర్తిదాయకంగా తీసుకోవాలని సూచించారు. అల్లర్లు, గుమ్మిగూడి చర్యలు, రెచ్చగొట్టే నినాదాలు వంటివి చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్యదర్శి ఆనంద్, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు మెంటే లక్ష్మణరావు, నూకల సత్యనారాయణ, నాయకులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



భీమవరం ప్రకాశంచౌక్ సెంటర్‌లో పోలీసుల మాబ్ ఆపరేషన్ డ్రిల్ దృశ్యం

భీమవరం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జూన్ 4వ తేదిన ఓట్ల లెక్కింపు ప్రశాంత వాతావరణంలో శాంతియుతంగా పూర్తిచేయడానికి ప్రజలంతా సహకరించాలని ఎస్పీ వేజెండ్ల అజిత అన్నారు. శుక్రవారం భీమవరం ప్రకాశం చౌక్‌లో మాబ్ ఆపరేషన్ డ్రిల్ ద్వారా ప్రజల్లో అవగాహన కల్పించారు. ఓట్లు లెక్కింపు సందర్భంగా శాంతిభద్రలకు విఘాతం కల్పించే విధంగా ప్రవర్తించే వారిని పోలీసుశాఖ ఏవిధంగా అణచివేస్తుందో మాబ్ ఆపరేషన్ డ్రిల్ ద్వారా వివరించారు. అలాగే అత్యవసర పరిస్థితిని అదుపు చేసేందుకు తీసుకునే చర్యలను ఆర్మ్‌డ్ రిజర్వు బలగాలు, పోలీసుల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీలు వి భీమారావు, ఏటీవీ రవికుమార్, డీఎస్పీలు నున్న మురళీకృష్ణ, వి.నారాయణస్వామిరెడ్డి, ఏఆర్ ఆర్ఐ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సాయిబాబా పవిత్రోత్సవాలు



ప్రత్యేక అలంకారంలో సాయిబాబా

ఆకివీడు: స్థానిక గుమ్ములూరు సెంటర్‌లోని సాయి మందిర్, 100 అడుగుల సాయి కోటీశ్వర్ మహాస్థూపం పవిత్రోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఐదు కోట్ల సాయి నామంలు రాసిన పుస్తకాలతో ప్రదర్శన జరిగింది. గ్రామంలోని పలు వీధుల్లో సాయి విగ్రహంతో పాటు నిక్షిప్తం చేయనున్న పుస్తకాల్ని పురవీధుల్లో ప్రదర్శించారు. సందర్భంగా అఖండ సాయి నామ సంకీర్తనల్ని ప్రారంభించారు. 25వ తేదీ శనివారం ఉదయం మహాస్థూపంలో ఐదు కోట్ల సాయి నామములు లిఖించిన పుస్తకాల్ని నిక్షిప్తం చేయనున్నారు. సాయింత్రం షిరిడి సాయిబాబా విగ్రహానికి పుష్పాభిషేకం చేస్తారని స్థానిక మందిర్ సాయి గురువు కోపల్లె సూర్యనారాయణచెప్పారు.

కిల్లర్కీ మొబైల్ సేవలు ఎంతో ఉపయోగం

పాలకొల్లు అర్బన్: ప్రతి గర్భిణి ఆరోగ్యకరమైన పండంటి బిడ్డకు జన్మనివ్వడానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, వారికి ఆరోగ్యకరమైన విషయాలపై అవగాహన కల్పించాలని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎం నవ్యజీవన్ కోరారు. పాలకొల్లు మండలం లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ఆవరణలో శుక్రవారం గర్భిణులకు కిల్కారి మొబైల్ సేవలు ఎలా అందించాలో ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలకు అవగాహన కల్పించారు. ఈ సేవల వలన గర్భిణులకు నాలుగవ నెల నుంచి బిడ్డ పుట్టే వరకు కిల్కారి మొబైల్ సేవలు ఎంతో ఉపయోగపడతాయని సూచించారు. ప్రతి రోజు ఆశ కార్యకర్తలు గర్భిణి ఇంటికి వెళ్లి కిల్కారి మొబైల్ సేవల సేవలు ద్వారా అవగాహన కల్పించాలన్నారు.

కాలుష్య కోరల్లో పంట కాలువలు

పంట కాలువల్లో
చెత్తను డంపింగ్ చేస్తున్న వైనం



గొల్లవానితిప్పలో పంటకాలువలోకి చేలమురుగునీటిని తోడుతున్న దృశ్యం (ఫైల్ ఫొటో)



లోసరి ఛానల్‌లో చెత్తతో ఉన్న దృశ్యం

భీమవరం అర్బన్: కాలుష్య కోరల్లో పంట కాలువలు కొట్టుమిట్టాడుతున్నాయి. దీంతో శివారు ప్రాంత గ్రామస్తులు ఆ నీటిని తాగి అనారోగ్యానికి గురవుతూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భీమవరం మండలంలో యనమదుర్రు, దిరుసుమర్రు, తోకతిప్ప, దెయ్యాలతిప్ప, నాగిడిపాలెం, కొత్తపూసలమర్రు, గూట్లపాడు, గొల్లవానితిప్ప, అనాకోడేరు, కొమరాడ, తుమ్మగొప్పి, తాడేరు, బేతపూడి, రాయలం, వెంప, తుందుర్రు తదితర 25 గ్రామాలకు రక్షిత మంచినీటి చెరువులకు తాగునీరు, సుమారు 59 వేల 490 ఎకరాల వరి, చేపలు చెరువులకు సాగునీరు అందుతుంది. మండలంలో ప్రధానంగా వెంప, లోసరి గూట్లపాడు, కాళీపట్నం, అనాకోడేరు ఛానల్స్ ద్వారా తాగు, సాగు నీరందుతుంది. భీమవరం పట్టణాన్ని ఆనుకుని ఈ పంట కాలువలు ప్రవహించడంతో కొంతమంది పట్టణవాసులు చెత్తను పంట కాలువల్లోనే డంపింగ్ చేస్తున్నారు. అంతేకాకుండా ఎగువన ఉన్న గ్రామస్తులు పంట కాలువల్లోకి డ్రెయినేజీలు తవ్వడంతో పంట కాలువలు కలుషిత కోరల్లో చిక్కుకుంటున్నాయి. కలుషితమైన నీరు మంచినీటి చెరువులోకి ప్రవహించి ఆ నీటిని తాగి తరచూ అనారోగ్యానికి గురవుతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలువలు ద్వారా నీటి ప్రవాహాన్ని నిలుపుదల చేయడంతో చెత్త, ప్లాస్టిక్, వ్యర్థాలు డంపింగ్‌కు మారింది. దీంతో చెత్తతో కాలువలు మురుగునీటి డ్రెయిన్‌లా దర్శనమిస్తున్నాయి.

కాలువల్లోనే చెత్త డంపింగ్

పంటకాలువల్లో భీమవరం పట్టణ వాసులు చిరిగిపోయిన బ్యాగులు, బొంతలు, ప్లాస్టిక్ వ్యర్థాలు, కోళ్ల కళేబరాలు ఇతర వ్యర్థాలు పడేయడంతో నీరు కలుషితం కావడంతో పాటు రెగ్యులేటర్ల వద్ద ప్రవాహానికి ఆటంకం ఏర్పడి దిగువకు సాగు, తాగునీరందటం లేదని దిగువ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మురుగునీటిని పంటకాలువల్లో తోడుతున్న వైనం

గూట్లపాడు, గొల్లవానితిప్ప, కొత్తపూసలమర్రు తదితర గ్రామాల్లో వరి పొలాలు, రొయ్యలు, చేపలు చెరువులకు మురుగు బోదెలు లేకపోవడంతో పంటకాలువల్లోనే నీటిని తోడుతున్నారు. దీంతో పంటకాలువలు కాలుష్య కోరల్లో చిక్కుకుంటున్నాయి.

పట్టణవాసులు బాధ్యతగా వ్యవహరించాలి

పట్టణవాసులు పంటకాలువల్లో చిరిగిపోయిన బ్యాగులు, బొంతలు, చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు వేయకుండా బాధ్యతగా వ్యవహరించాలి. దిగువన గ్రామాలు ఈ నీరే తాగుతారని గమనించాలి. ఎవరైనా చెత్త పంట కాలువల్లో డంప్ చేస్తే అట్టివారికి జరిమానాలు విధించి చర్యలు తీసుకుంటాం.

– భూపతిరాజు వెంకట ప్రసాదరాజు, ఏఈ, ఇరిగేషన్, భీమవరం

సిమెంట్ బల్లలు వితరణ



కనకదుర్గమ్మ ఆలయం వద్ద సిమెంట్ బల్లలు ఏర్పాటు చేసిన కాపు వనిత క్లబ్ సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలోని పాదచారులు, ప్రయాణీకులు, భక్తులు కూర్చోవడానికి అనుకూలంగా ఉండాలనే ఉద్దేశంతో సిమెంట్ బల్లలు ఏర్పాటు చేసినట్లు యునైటెడ్ కాపు వనిత సర్వీస్ క్లబ్ అధ్యక్షురాలు మంగెన అరుణ తెలిపారు. శుక్రవారం పట్టణంలో అయ్యప్పస్వామి ఆలయం పూలపల్లి బైపాస్ రోడ్డు వద్ద ప్రయాణీకుల కోసం, కెనాల్ రోడ్డు కనకదుర్గమ్మ ఆలయం వద్ద భక్తుల కోసం, గాంధీబొమ్మల సెంటర్ వద్ద పాదచారుల కోసం దాతల సహకారంతో సిమెంట్ బల్లలు ఏర్పాటు చేశారు. అరుణ మాట్లాడుతూ వనిత క్లబ్ ద్వారా బల్లలు ఏర్పాటుకు దాతలు డాక్టర్ ముచ్చర్ల సంజయ్, కొండ్రెడ్డి సూరిబాబు తమ సహకారం అందించారన్నారు. ఈ కార్యక్రమంలో కాపు క్లబ్ గవర్నర్, డాక్టర్ ముచ్చర్ల సంజయ్, జక్కంపూడి కుమార్, పెనుమాక రామ్మోహన్, జక్కంపూడి మధన్, మంగెన సాయి, వనిత క్లబ్ సభ్యురాళ్లు శిద్దిరెడ్డి శైలజ, డాక్టర్ కావలి మౌని, రావి సృజన, నారిన సూర్యకుమారి, దేవరపు కాంచన మాల, ముళ్లపూడి లావణ్య, బంగారం మణి, గుండుమోగుల భారతి తదితరులు పాల్గొన్నారు.